## 12

# కుమారుడైన దేవుడు

క్రీ.శ. 325లో ఇప్పుడు టర్కీగా పిలువబడుతున్న అప్పటి పశ్చిమోత్తర ప్రాంతమైన నైసియాలో 318 మంది సంఘ నాయకులుగా సమావేశమయ్యారు. యేసు యొక్క ఖచ్చిత స్వభావం మరియు తండ్రియైన దేవునితో ఆయనకున్న సంబంధమును గురించిన వివాదమును పరిష్కరించడం వీరి సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం. దేవుని చేత సృష్టించబడిన వ్యక్తి యేసు అని, ఆయనకు ఒక ఆరంభమున్నదని, అతడూ మార్పులకు గురవుతాడని ఏరియస్ అనే బోధకుడు చేసిన బోధనలను, పరిశీలించడానికి వారు సమావేశమయ్యారు.

నైసీను సమావేశ అనంతరం, వారందరూ ఒక ముగింపునకు వచ్చారు. అదే నైసీను విశ్వాస ప్రమాణం:

> దృశ్యములు, అదృశ్యములైయున్న సమస్తమునకు సృష్టికర్తయైన, అన్నిటిని నడిపించువాడునైన ఒక్కడైయున్న తండ్రియైన దేవునియందు నమ్మికయుంచుతున్నాము.
>
> దేవుని అద్వితీయ కుమారునిగా పుట్టిన ఒక్కడే ప్రభువునైన యేసు క్రీస్తు అంటే, తండ్రి సారాంశమును, దేవునియొద్దనుండి దైవం, దేవునినుండి దేవుడును, వెలుగునుండి వెలుగును, నిజమైన దేవుని నుండి నిజమైన దేవుడును, సృష్టింపబడక జన్మించినవాడును, తండ్రితో ఏకత్వము గలవాడునైయున్నాడు; సమస్తమును ఆయన మూలముగా కలిగెను. ఆయన మనుష్యులమైన మనకొరకును, మన రక్షణకొరకును, పరలోకమునుండి దిగివచ్చి, శరీరధారియై మనుష్యుడాయెను అని నమ్ముచున్నాము. ఆయన మనకొరకు సిలువ వేయబడెను, పాతి పెట్టబడెను, మూడవ దినమున తిరిగి లేచియుండెను. ఆయన సజీవులకును మృతులకును తీర్పు తీర్చుటకు మహిమతో తిరిగి వచ్చును.
>
> పరిశుద్ధాత్మను నమ్ముచున్నాము.
>
> మరియు ఆయన రాక ముందు ఆయన ఉనికి లేదని, ఆయన శూన్యము నుండి ఉద్భవించాడని, దేవుని కుమారుడు వేరయిన అంశం *hypostasis* లేదా వ్యక్తత్వం *ousia* గలవాడని, ఆయన సృజింపబడిన వాడిని, లేదా మార్పుగలవాడని చెప్పువాడు కథోలిక్ మరియు అపొస్తలుల సంఘపువారి శాపమును నిశ్చియముగా పొందును.[1]

మనుష్యులచే తయారు చేయబడిన ఈ విశ్వాస ప్రమాణము, క్రీస్తును "తండ్రి మీ సారాంశమని," "నిజమైన దేవుని నుండి నిజమైన దేవుడు," "సృజింపబడక జన్మించినవాడు" అని చెప్తుంది. ఈ విశ్వాసమును ధిక్కరించి మాట్లాడిన వాడు వీరిచే తీర్మానించబడిన "శాపమును" పొందును అని ఈ సమావేశంలో పాల్గొన్నవారు తీర్మానించారు. యేసు స్వభావం గురించిన ప్రశ్నలు, సందేహాలను ఈ నైసీయా విశ్వాస ప్రమాణం పూర్తిగా నిలువరించలేకపోయింది. ఈనాడు ఉన్నట్లే దీని విషయమై ఎన్నో చర్చలు, వాదోపవాదాలు తరువాత కాలంలో కొనసాగాయి.

నైసీయా విశ్వాస ప్రమాణం వ్రాయించడంలోని సమస్య ఏమంటే, దాని వ్రాయించినవారు యేసు గురించిన,[2] వారి విశ్వాసమును తెలియజేస్తూ, వాక్యపరముకాని పదమైన *hypostasis*

("సారాంశం" లేదా "సత్యత") అను పదమును ఉపయోగించారు. యేసును గురించిన స్పష్టమైన విశ్వాసము మనకు మానవ లిఖిత విశ్వాస ప్రమాణములలో కనబడదుగాని, యోహాను 1:1–18లో కనబడుతుంది. ఇది యేసు యొక్క స్వభావము గురించి స్పష్టంగా చెప్తుంది అలాగే, "యేసు దేవుడా లేక దేవునివంటివాడా?"; మరియు "ఆయన దైవిక మానవుడా లేక దైవిక లక్షణాలున్న మనుష్యుడా? లేక సగం దేవుడు సగం మానవుడా?" అన్న పురాతన ప్రశ్నలకు కూడ సమాధానం చెప్తుంది. ఈ ప్రశ్నలకు యోహాను 1:1–18లో జవాబు దొరుకుతుంది. కాబట్టి యేసు స్వభావం గురించి ఈ వాక్యం ఏం చెప్తుందో జాగ్రత్తగా పరిశీలించుదాము.

## యేసు సంపూర్ణ దేవుడు

మిగిలిన మూడు సువార్తల కంటే కూడా యోహాను సువార్త, యేసు యొక్క కథను సృష్టి ఆరంభంనుండి ప్రారంభిస్తున్నది. మత్తయి మరియు లూకాలు యేసుని జననంతో ఆరంభిస్తుండగా, మార్కు తన సువార్తను యేసుని యౌవ్వన దశనుండి ఆరంభిస్తున్నాడు. ఇందుకు భిన్నంగా, యోహాను నిత్యత్వమునుండి ఆరంభిస్తున్నాడు – "ఆదియందు వాక్యముండెను." మనం క్రీస్తు "పూర్వస్థితిని" గురించి మాట్లాడుకొనగలుగుతున్నామంటే "ఆదియందు" వాక్యము ఉనికిలో ఉంది. "ఆదియందు" అన్న మాటలు మనలను సహజంగానే ఆదికాండము 1కు తీసుకువెళ్తాయి. నిజానికి, ఆదికాండము 1లో ఇది ఏ అర్థాన్నిస్తుంది, అదే అర్థం యోహాను 1 లోనూ ఉంది: "ఆదియందు" అంటే, యేసు యొక్క ఉనికికి ముందు కాదు గాని, ఏదియు సృష్టింపబడకముందు, వాక్యం ఉంది అని అర్థం.

యేసుని "వాక్యం" అని యెహాను ఎందుకు పిలిచాడు? దీనికి జవాబిచ్చే ముందు అతడు యేసు గురించే మాట్లాడుతున్నాడని 14వ వచనం తెలియజేస్తుందని మనం గమనించాలి: "ఆ వాక్యము శరీరధారియై కృపా సత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను." దీని తరువాత అతడు యేసుని కథను ఆరంభించాడు. అయితే అతడు యేసును "వాక్యం" అని ఎందుకు సంబోధించాడు? క్రొత్త నిబంధన గ్రంథకర్తలలో యోహాను ఒక్కడే యేసుకు ఈ పేరును ఇచ్చినవాడు (ప్రకటన గ్రంథాన్ని కూడ యోహాను వ్రాశాడు కాబట్టి; ప్రకటన 19:13ను చూడు). ఇందులో అతడి ఉద్దేశం ఏమిటి?

మొదటిగా, దేవుని తత్వం యొక్క మూర్తిమంతం యేసు అని "వాక్యం" (*logos*) తెలియజేస్తుంది. వ్రాయబడిన మాట అయినా, లేక చెప్పబడిన మాట అయినాగాని, "మాట" అనేది ఒకరి మనస్సులోని భారమును మరొకరితో వ్యక్తపరచుటకు ఉపయోగపడే సాధనం. దేవుని హృదయాన్ని చిత్తమును మనకు తెలియజేయడంలో యేసు ఒక సాధనమని యోహాను తెలియజేయడంలో ఇదే విషయాన్ని హెబ్రీయులకు 1:1, 2 తెలియజేస్తుంది: "పూర్వకాలందు నానా సమయములలోను, నానా విధములు గాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను ..." (ESV).

రెండవదిగా, యేసును "వాక్కు" అని పిలుచుట ద్వారా ఆయన దేవుని శక్తి యొక్క వ్యక్తీకరణము అని తెలియజేయబడ్తుంది. యెషయా 55:8–11 ప్రకారం, మన కత్తులకు లేని అద్భుత గుణం దేవుని వాక్యానికుంది. ఇది ఎంతో శక్తివంతమైనదై, దేవుని ఉద్దేశాలను

నెరవేరుస్తుంటుంది. దేవుడు ఏం చెప్పాడో, అది నెరవేరుతుంది. అందుకనే ఆదికాండము 1లో సృష్టిగాథలో "దేవుడు పలుకగా, ఆ ప్రకారమాయెను" అన్న మాట విరివిగా కనబడుతుంది. దేవుడు ఏం చెప్పాడో అది జరిగింది. "యెహోవా వాక్కు చేత ఆకాశములు కలిగెను" (కీర్తనలు 33:6ఎ). క్రీస్తు యేసు ద్వారా దేవుడు తన శక్తిని చూపించాడు. ఆ శక్తి జీవమును, వెలుగును కలుగజేస్తుంది (4, 5 వచనాలు) మరియు పాపులను దేవుని పిల్లలనుగా చేస్తుంది.

"ఆ వాక్యము దేవుని యొద్దనుండెను" అని చెప్పుట ద్వారా కుమారుడైన క్రీస్తు, తండ్రియైన దేవుడు ఇద్దరు ఒక్కరే కాదు కానీ, కానీ విభిన్న వ్యక్తిత్వములు గలవారని యోహాను స్పష్టం జేస్తున్నాడు. ఇది ముఖ్యమైన విషయం – దేవుడు ఒక నిర్దిష్ట కాలంలో యేసుని రూపంలోనున్నాడని మనం భావించకూడదు. దేవుడు ఒకే వ్యక్తిగానుండి విభిన్న కాలములలో యేసునిగా, పరిశుద్ధాత్మునిగా ఉన్నాడన్న సిద్ధాంతమును "స్వరూప వాదం" (Modalism) అని పిలుస్తారు. దీనిని వాదించువారు స్వరూప వాదులుగా పిలువబడతారు. దేవుడు ఒక్కడేనన్న వాక్యం సత్యమునకు న్యాయం చేకూరుస్తుందని, "త్రియేకము" అన్న పదమును ఇది తొలగిస్తుందని వారు వాదిస్తుంటారు. కానీ ఈ సిద్ధాంతం వాక్యంలోని కొంత ముఖ్యమైన పట్టును కోల్పోయింది. ఉదాహరణకు, దేవుడు తన కుమారుని ఈ లోకంలోనికి "పంపించాడని" మనం నేర్చుకున్నాము (అనేకమైన ఉదాహరణలున్నా, యోహాను 16:5–11ను చూడు). వీటిని గమనిస్తే, తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ విభిన్నమైన వారుగానున్నాగాని ఏకమైన దేవుడు అన్న సత్యాన్ని మరువలేము.

తరువాత, "వాక్యము దేవుడైయుండెను" అని మనం చూస్తున్నాము. తండ్రి దైవమై ఉన్నట్లే, యేసు దైవమై ఉన్నారు. పాత నిబంధన, క్రొత్త నిబంధనలు ఎంతగా పెనవేసుకు పోయాయంటే, దేవుడు ఒక్కడేనని ఇవి రెండూ స్పష్టం చేస్తున్నాయి. ఈ విషయాన్ని గ్రహించడం కొంచెం కష్టం అందుకనే అన్ని వివాదాలు ఆరంభమయ్యాయి. ఇదే విషయం యోహానుకు నెమ్మదిగా అవగతం అయింది. యేసు పునరుత్థాన విషయంలో, రుజువు ఉంటేనే తప్ప నేను నమ్మనని వాదించిన తోమాకు యేసు ప్రత్యక్షమయి, తన గాయములలో తోమా వ్రేళ్ళు పెట్టి చూడమన్నప్పుడు, తోమా – "ప్రభువా, నా దేవా" అని అన్నాడు (యోహాను 20:28).

లోకము యొక్క సృష్టిలో వాక్కు యొక్క పాత్రను తెలియజేస్తూ, యోహాను 1లో యేసు దేవుడు అన్న భావమును యోహాను చక్కగా వ్యక్తపరిచాడు: "సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండా కలుగలేదు" (3 వచనం); "ఆయన లోకములో ఉండెను. లోకమాయన మూలముగా కలిగెను గాని లోకమాయనను తెలిసికొనలేదు" (10 వచనం).

నిత్యత్వమునుండి నిత్యత్వము వరకు ఉండగలిగేది దేవుడొక్కడే. లోకమును దేవుడు మాత్రమే సృష్టించగలడు. జీవమును, వెలుగును ఇవ్వగలిగేది దేవుడు మాత్రమే. ఈ వాక్యములన్నియు దేవుని వాక్కు అయిన యేసునందు సత్యములని యోహాను సువార్త తెలియజేస్తుంది.

## యేసు సంపూర్ణ మానవుడు

యేసు ఈ లోకమునకు వచ్చినప్పుడు, ఆయన శరీరధారియైయున్నాడని యోహాను 1:14ఎ స్పష్టం చేస్తుంది: "ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణునిగా మన మధ్య

నివసించెను." ఇలాగాకుండా, "ఆ వాక్యము మానవుడయ్యాడు" లేదా "ఆ వాక్యము మనిషి అయ్యాడు" అని యోహాను చెప్పవచ్చు, కానీ యేసు ఈ లోకంలోనుండగా ఆయన శరీర స్వరూపం గురించి యోహాను వ్రాస్తున్నాడు. ఇలా చేయడం వలన యోహాను కాలంలో, యేసు మానవరూపం ధరించలేదని, అలా కనబడ్డాడని చెప్పిన వారికి యోహాను ఈ వాక్యం ద్వారా వారి చెంప మీద కొట్టినట్లయింది. వారు "ఆత్మవాదులు" అని పిలువబడేవారు. ఇది *"dokeo"* అన్న గ్రీకు పదంనుండి వచ్చింది. దీనికి "అలా కనిపించుట, భావించుట" అని అర్థం. అలాగే, శరీరం దుర్మార్గమైనది, చెడిందని, ఆత్మ ఒక్కటే మంచిదని వీరు నమ్మేవారు. కాబట్టి యోహాను తన వాదనను స్పష్టంగా తెలియజేస్తున్నాడు: "వాక్యము శరీరధారియయ్యాడు." "ఆత్మవాదులు" యోహాను ఉద్దేశంలో ఉన్నారో లేదో గాని, ఇక్కడ విషయాన్ని మాత్రం స్పష్టం చేశాడు.

వాక్యము శరీర "ధారి" (became) ఆయెను అని అంటే, శరీరతత్వము లేదా మానుషత్వం అనేది యేసుని అసలు ప్రధాన స్వభావ రూపములలో ఒకటి కాదు గాని, ఈ లోకములోనున్నంతకాలం ఆయన స్థానము ఇది అని అర్థమవుతుంది. దీనినే యోహాను తరువాత మాటలలో సృష్టం చేస్తున్నాడు, "మన మధ్య నివసించెను" నివసించడం (dwelt) అన్న మాటకు గల మూల గ్రీకు పదమునకు "గుడారము ఏర్పరచుకోవడం" లేదా "తన స్థావరమును నిలుపడం" అని అర్థం. గుడారము అనేది శాశ్వతంగా నివసించే ప్రదేశం కాదు. ఇది శాశ్వతమైనది కాదు, తాత్కాలికమైనది. యేసు యొక్క శరీర స్వభావము కూడా ఇటువంటిదే! ఆయన తాత్కాలికంగా తన గుడారమును మన మధ్య వేసుకున్నాడు. దీనినే "శరీరధారి" (incarnation) అగుట అని అంటాము. ఇది "శరీరం" అన్న లాటిన్ పదమునకు సంబంధించినది. అక్షరార్థముగా చెప్పాలంటే ఇది యేసు "శరీరమును ధరించుకోవడం." అంటే, మానవులు అనుభవించే ప్రతి దానిని యేసు శరీరరీతిగా సంపూర్ణముగా అనుభవించాడు. మనవలనే ఆకలిగొన్నాడు, అలసిపోయాడు, నిద్రపోయాడు. ఆయన సిలువనెక్కుటకు ముందు ఎంతో విభ్రాంతినొంది, చింతాక్రాంతుడయ్యాడని మార్కు 14:33 తెలియజేస్తుంది. మన శరీర విషయములో ఏది జరుగుతుందో, అవన్నీ ఆయన విషయంలోనూ జరిగాయి.

దేవుడు ఎందుకు శరీరధారి అయ్యాడు? ఇందుకు యోహాను 1:18 సరైన సమాధానాన్నిస్తుందు: "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్మునున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరిచెను." "బయలుపరచెను" అన్న మాట *"exegeomai"* అన్న గ్రీకు పదం నుండి వచ్చింది. దీనినుండే (వివరణ) "exegesis" అనే ఇంగ్లీషు పదం వచ్చింది. "Exegesis" అంటే, నిగూఢార్థంగానున్న వాక్య లేఖనమును తీసుకుని వ్యాఖ్యానకర్త దాని అర్థమును వివరించి చెప్పడం. దీనిని "వివరించడం, భావము ఇవ్వడం" అని అర్థం. యేసుని ఆగమనం మనందరికి ఇదే చేసింది: దేవుని గురించిన సత్యాలను మనం ఏవిధంగానూ తెలుసుకోలేకుండా ఉన్నప్పుడు వాక్యం శరీరధారియై వాటిని మనకు తెలియజేశాడు. అల్ప జ్ఞానులమైన మనము దేవున్ని శరీరధారిగా "చూడడం" గాకుండా మరే విధంగా ఆయన ఘన మహిమను, శక్తిని మరియు కృపాసత్యతను అర్థంచేసుకోగలం. "మనము ఆయన ద్వారా జీవించునట్లు దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను. దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపర్చబడెను. మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే

మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమైయుండుటకు తన కుమారుని పంపెను. ఇందులో ప్రేమయున్నది" అని యోహాను 4:9, 10 తెలియజేస్తుంది. దేవుడు ఎల్లప్పుడు ప్రేమను చూపే దేవుడు. కానీ యేసు ఈ లోకమునకు వచ్చి సిలువలో చనిపోయేంత వరకు ఆయన ప్రజలు ఆయన ప్రేమను అర్థం చేసుకోలేకపోయారు.

ప్రభువా, తండ్రిని మాకు కనపరచుము, మాకంతే చాలునని ఫిలిప్పు యేసును అడిగినప్పుడు, "ఫిలిప్పూ, నేనింతకాలము మీ యొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు గనుక తండ్రిని మాకు కనపరుచుమని యేల చెప్పుచున్నావు?" అని యేసు సమాధానమిచ్చాడు (యోహాను 14:8, 9). ఫిలిప్పు వలె యేసును ప్రత్యక్షంగా చూడడం లేదా మనవలెనే యేసును లేఖనముల ద్వారా చూడడం వలన మాత్రము మరేవిధంగాను చూడలేని దేవున్ని మనం చూడగలం.

"ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను; కృపయు సత్యమును యేసు క్రీస్తు ద్వారా కలిగెను" అని యోహాను 1:17 తెలియజేస్తుంది. అంటే, దీని అర్థం, యేసు రాక ముందు కృప మరియు సత్యము లేదా వాటి గురించిన అవగాహన లేవని కాదు. ఇలా భావించడం, పాత నిబంధనను తప్పుగా అర్థం చేసుకోవడమే. యేసు రాకకు ముందే సహజంగానే కృప, సత్యములు ఉన్నాయి. ఇశ్రాయేలు పట్ల దేవుడు చూపించిన సహనం, ఓర్పు, ఆయన కృపకు నిదర్శనములు. "పది ఆజ్ఞలు" మరియు ఆయన ప్రవక్తల ప్రవచనములైన దేవుని వాక్కు ద్వారా ఆయన సత్యత ప్రత్యక్షపర్చబడింది. యేసు రాక ముందు వరకు కృప మరియు సత్యములు ఉనికిలో లేవన్నది యోహాను ఉద్దేశం కాదు గాని ఆయన (యేసు) వచ్చేంతవరకు అవి సంపూర్ణముగా బయలుపరచబడలేదు. "యెహోవా దీర్ఘశాంతుడు కృపాసమృద్ధిగలవాడు" అని కీర్తన 103:8 తెలియజేస్తుంది. కానీ యేసు శరీరధారియై, సిలువలో మరణించేంతవరకు ఈ కృప ఎంతటి కృప అన్నది తెలియలేదు.

యేసుని స్వభావం గురించి యోహాను 1:1-18 రెండు మంచి విషయాలను చెప్తుంది: *ఆయన సంపూర్ణ దేవుడు, అలాగే ఆయన లోకంలో ఉన్నంతకాలం సంపూర్ణ మానవునిగానున్నారు.*

## రెండు ముఖ్య ప్రశ్నలు

యోహాను మాటలు యేసుని స్వభావాన్ని గురించిన రెండు ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. మొదటిగా, "*[యేసు సంపూర్ణ దేవుడు, సంపూర్ణ మానవుడు]* అన్న బోధన మిగతా లేఖనములతో సరిపోలుతుందా?" దీనికి సరైన సమాధానాన్ని పౌలు తన మూడు పత్రికలలో యిస్తున్నాడు. ఫిలిప్పీయులకు 2:5-8లో యిలా వ్రాసాడు,

> క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన *దేవుని స్వరూపము కలిగినవాడైయుండి,* దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, *మనుష్యుల పోలికగా పుట్టి,* దాసుని స్వరూపమును ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా చేసుకొనెను. మరియు ఆయన *ఆకారమందు మనుష్యుడిగా కనబడి* మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్నుతాను తగ్గించుకొనెను. (నొక్కి చెప్పింది నాది.)

పౌలు యొక్క ఆలోచన యోహాను యొక్క ఆలోచనతో సరిగ్గా సరిపోయిందని గుర్తించబడిన వాక్యముల ద్వారా అర్థమవుతుంది. యేసు దేవుని స్వరూపమును కలిగినవాడైనా గాని (వాక్యము దేవుడైయుండెను), ఆయన ఆకారమందు "మనుష్యునిగా కనబడ్డాడు" ("వాక్యము శరీరధారియైయున్నాడు").

అలాగే కొలొస్సయులకు 1:15–19లో పౌలు యిలా వ్రాస్తున్నాడు,

> ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవి గాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, ఆయన అన్నిటికంటే ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు. సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆది సంభూతుడాయెను. ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెనని … తండ్రి అభీష్టమాయెను.

ఇదే విషయము తిరిగి కొలొస్సయులకు 2:9లో స్పష్టం చేయబడింది: "ఏలయనగా దేవత్వముయొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది." "మరో మాటలో చెప్పాలంటే, దేవుని విషయంలో ఏది సత్యమో అది క్రీస్తు విషయంలోనూ సత్యము. ఇక్కడ కూడా, పౌలు పేర్కొన్న "సర్వ సంపూర్ణత" యోహాను పేర్కొన్న "వాక్యము దేవుడాయెను" సమానార్థముగా ఉన్నాయి. దేవుడు క్రీస్తును మొదటిగా సృష్టించాడని ("సర్వ సృష్టికి ఆది సంభూతుడు") నాలుగవ శతాబ్దములో ఏరియస్ బోధించిన విషయం ఈ వాక్య భాగమునకు సరిగ్గా సరిపోతుందని కొంతమంది అభిప్రాయపడుతుంటారు. కానీ, ఈ వాక్య నేపథ్యమునకు ఈ వ్యాఖ్యానం అస్సలు సరిపోదు. ఒకవేళ దేవుని "సర్వ సంపూర్ణత" క్రీస్తునందు నివసిస్తున్నట్లయితే, ఆయన సృజింపబడినవాడు కాదు. "ఆది సంభూతుడు" (firstborn) అనేది ప్రాధాన్యత మరియు ప్రాముఖ్యతకు సంబంధించినది కానీ సమయానికి సంబంధించినది కాదు. పాత నిబంధనలో జ్యేష్ఠ పుత్రుడు అంటే, అతనికి తండ్రి నుండి రెండింతల స్వాస్థ్యము దొరుకుతుంది అలాగే తండ్రి తదనంతరం కుటుంబ నాయకత్వపు బాధ్యత అతనిపై ఉంటుంది. యేసు "మొదటిగా సృష్టింపబడినవాడని కాక" ఆధిక్యత గల హోదాను కలిగియున్నాడని పౌలు మనసులో ఉండియుండవచ్చు. లేకపోతే అతడు మరోలా వ్రాసియుండేవాడు.

ఇక ఇప్పుడు తీతు 2:11–13ను చూద్దాము:

> ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధమై దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము, అనగా మహా దేవుడును మన రక్షకుడునైన యేసు క్రీస్తు మహిమయొక్క ప్రత్యక్షతకొరకు ఎదురుచూచుచు, ఈ లోకములో స్వస్థబుద్ధితోను నీతితోను, భక్తితోను బ్రదుకుచుండవలెనని మనకు బోధించుచున్నది.

ఇక్కడ పౌలు యేసును "దేవుడు" (*Theos,* యోహాను 1:1లో వ్రాయబడినట్లు) అని పేర్కొంటున్నాడు. ఇది సత్యమే. అయితే యేసును "దేవుడు" అని పిలువకుండా, యేసునకు, దేవునికి మధ్య తేడాను చూపిస్తూ RSV మరియు NRSVలో "మహా దేవుడు మరియు మన రక్షకుడు" అని వ్రాయబడింది. కానీ గ్రీకు వాక్య భాగం యిలా వ్రాయబడలేదు. కొంతమంది ఇంగ్లీషు భాషాంతరములలో యిలా వ్రాయబడింది. ఏదేమైనా, యేసును "దేవుడు" అని పిలువడంలో పౌలు కూడా యోహానుతో జత కలిపాడు.

యేసు స్వభావం గురించిన అభిప్రాయాన్ని యిలా వ్యక్తపర్చిన యోహాను పౌలు మాత్రమే కాదు. యేసు "దేవుని మహిమయొక్క తేజస్సును, ఆయన తత్వముయొక్క మూర్తిమంతమునైయుండి, తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించువాడు" అని హెబ్రీయులకు 1:3లో వ్రాయబడింది. "ఆయన తత్వముయొక్క మూర్తిమంతము" అంటే, దేవుని స్వభావమును ఉన్నదున్నట్లుగా కలిగియున్నవాడని అర్థము. కొన్ని వచనముల తరువాత, గ్రంథకర్త కీర్తనలు 45:6, 7ను మరియు పాత నిబంధన వాక్యాలను ఉదహరిస్తున్నాడు. తద్వారా కుమారుడ్ని "దేవుడు" (1:8) అని పిలుస్తున్నాడు. ఈ పత్రికలో యేసును "ప్రభువు" అని కూడ పేర్కొన్నారు. పాత నిబంధనలో ఇది దేవునికి వాడబడింది (చూడు 7:14). కాబట్టి యేసుని దైవత్వము మరియు మానవ స్వభావం గురించిన యోహాను భావములు మిగతా క్రొత్త నిబంధన లేఖనములతో అనుగుణ్యముగా కలిగియున్నాయని చెప్పవచ్చు.

యోహాను వాక్యమును బట్టి రేకెత్తబడిన ప్రశ్నలలో రెండవది *"తండ్రి మరియు కుమారుడు ఇద్దరూ ఒకే దేవుడని మనం ఎలా నమ్మగలం?"* తార్కికంగా, ఇద్దరు వ్యక్తులు ఒక్కరు కాలేరు. అయితే తండ్రియైన దేవుడు కుమారుడైన క్రీస్తు ఇద్దరూ ఒకే దేవుడు ఎలా అవుతారు? పరిశుద్ధాత్ముడిని కూడా వీరితో కలిపితే సమస్య మరింత అవుతుంది. ముగ్గురు వేర్వేరు వ్యక్తులు ఒకే దేవునిగా ఎలా ఉండగలరు? ఉండవచ్చు. ఇందుకు రెండు ప్రధాన విషయాలను చూడవచ్చు.

1. మొదటి ప్రతిస్పందనగా, మనకు అర్థంకాని దాన్ని మనం నమ్మగలగాలి. దీన్ని మనం అందరం చేస్తునే ఉంటాము. ఉదాహరణకు, విమానాలు ఎలా ఎగురగలుగుతున్నా. నాకు అర్థం కాదు. అవి లేవడం, ఎగరడం గురించిన వివరణలను నేను విన్నాను కానీ, నాకు అర్థం కాలేదు. 747 జెట్ విమానం, దానిలోని ప్రమాణికులు, వారి సామాను, అందులోని ఇంధనం దాని భారీ పరిమాణం ఇవన్నీ చూసి అది అలా ఎగురగలుగుతుందో నాకు అర్థం కాదు. ఇంతేగాకుండా నేను అలాంటి దానితో ప్రయాణం చేశాను. అది పనిచేస్తుందని నేను ఒప్పుకుంటున్నాను. అలాగే, యోహాను 3:16 మనకు ఏం చెబుతుందో దాన్ని నమ్మి తీరాలి: "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను." ఇదే నాకు అర్థం కాదు. పాపులైన ప్రజల కొరకు తన స్వంత కుమారుని సైతం త్యాగం చేసేంతగా ప్రజలను దేవుడు ఎలా ప్రేమించగలిగాడు? మానవ అల్పజ్ఞానమునకు ఇది అందదు – కానీ, క్రైస్తవులముగా దీనిని మనం నమ్మాలి. మరయితే, దేవుని తత్వము గురించి మనకు అర్థంకాని విషయాన్ని నమ్ముటకు మనమెందుకు సందేహించాలి?

2. ండవ ప్రతిస్పందనగా, దేవుని గురించి, ఆయన తత్వము గురించి మనకు అర్థం

కాని విషయాలను మనం నమ్మాలి. ఇది మనకు క్రొత్తగా ఉండనక్కరలేదు. మనం దేవున్ని పూర్తిగా అర్థం చేసుకొనగలిగితే, ఆయన ఎటువంటి దేవుడు? నిజానికి, దేవుని గురించి మనకు అర్థం కానివి ఎన్నో ఉంటాయి. శూన్యమునుండి ఆయన సృష్టిని ఎలా చేయగలిగాడు? ఆయన తన “మాట” చేతనే సమస్తమును ఉనికిలోకి తేగలిగాడంటే, ఆయన మాటకు ఎంతటి శక్తి ఉండి యుంటుంది? ఈ భూమి మీద కోటానుకోట్లమంది ప్రజలుండగా, ప్రత్యేకంగా ఒకరి జీవితంలో ఏం జరుగుతుందో దేవునికి ఎలా తెలుస్తుంది? దేవునికి మనం ఎంతగా తెలుసంటే, మన తల వెంట్రుకలు సహితం లెక్కపెట్టబడ్డాయని యేసు చెప్పాడు. అన్నిటికంటే మహా గొప్ప మర్మం ఇదే కావచ్చు – ఆయన మన గురించి ఎందుకు ఆలోచిస్తున్నాడు? పాపులతో నిండి పోయిన ఈ లోకము నిమిత్తం ఆయన తన కుమారుని ఎందుకు అనుగ్రహించాలి? అందులోనూ ఎక్కువమంది ఆయన గురించి లెక్కచేయని వారే గదా! కాబట్టి, దేవుని గురించిన అనేక విషయాలు మనకు తెలియవు అని మనం ఒప్పుకుందాము.

## ముగింపు

యేసు దేవుడా? అవును. ఆయన మనుష్యుడా? అవును. మనం దాన్ని గ్రహించామా? లేదు. కానీ మనం దాన్ని నమ్మాలి. మన ఆత్మలు దాని మీదనే ఆధారపడి ఉన్నాయి. “ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను” (యోహాను 1:1); “తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి అనగా తన నామమునందు విశ్వాసముంచినవారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను” (యోహాను 1:12).

---

సూచనలు

[1]John H. Leith, *Creeds of the Churches* (Atlanta: John Knox, 1973), 30-31. [2]బైబిలు పరముకాని భాషను బైబిలు భావాలను వివరించడానికి ప్రయోగించడం విశ్వాస ప్రమాణాన్ని అనుసరించువారి విధానమును పునరుద్ధరించుట విడ్డూరం (అలా చేయకపోతే ఆ ప్రమాణం లేఖనములను పునరుచ్చరించడమే). అందువలనే వారిలో వాదోపవాదాలు కొనసాగాయి.